# చిరునవ్వు వెల ఎంత?

వెంకటసుబ్బారావు స్కూటరు దిగాడు.

వెంకటేశ్వర విలాస్ ప్రొప్రయిటర్ భుజంగరావు కౌంటర్‌లో కూర్చునే సుబ్బారావును చూశాడు. 'ఈ ముండా కొడుకు మళ్ళా తగలడ్డాడు' అనుకున్నాడు.

సుబ్బారావు దగ్గరగా వచ్చాడు. 'దయచేయండి సార్. ఏం సార్ బావున్నారా?' అని మొహం చాటంత చేసుకొని నవ్వాడు భుంజగరావు.

సుబ్బారావు మాట్లాడలేదు. అతను ఆప్యాయంగా పలకరించినా పలకలేదు. మర్యాదగా మాట్లడితే 'కస్టమర్లు' నెత్తినెక్కేస్తారని వాళ్ల డిపార్ట్‌మెంట్ వాళ్ళు ఎప్పుడూ అలా మొహాలు ముడిచేసుకొని తిరుగుతారు.

'డబ్బు సిద్దంచేశావా?' అని అడిగాడు సుబ్బారావు.

భుజంగరావు నవ్వాడు. ఏడవలేక నవ్వాడు. 'సర్, సర్దుబాటు కాలేదు. సర్,, మాది చిన్న వ్యాపారం సర్... ఏదో ఈసారికిలా పోనివ్వండి సర్... ఈ రెండువేలూ ఉంచండి సర్...' అని రెండువేలూ వెంకటసుబ్బారావు ముందు పెట్టాడు భుజంగరావు. ఆ డబ్బువంక పురుగును చూసినట్లు చూశాడు.

'ఏంటయ్యా ఇది? నాకేమన్నా ముష్టి ఏస్తున్నావా? దానంచేస్తున్నావా? ధర్మం చేస్తున్నావా? ముప్ఫయివేలు కట్టాలయ్యా నువ్వు... పదివేలు ఇయ్యమంటే ఏడుస్తావేంటి? ఇప్పటికే బాగా ఆలస్యమైపోయింది. ఇంక టైం ఇవ్వం. వారంరోజుల్లో కట్టకపోతే యాక్షన్ తీసుకుంటాం. నీ ఇష్టం ఆలోచించుకో. ఇదే లాస్ట్ వార్నింగ్...' అనేసి బెట్టుసరిగా స్కూటర్ ఎక్కి కూర్చున్నాడు.

భుజంగరావు వచ్చి కాళ్ళావేళ్లాపడి వేడుకుంటాడేమోనని ఎదురుచూశాడు. వాళ్ల డిపార్ట్‌మెంట్‌లో ప్యూన్ దగ్గరనుంచీ ఆఫీసరుదాకా అందరకీ అదే అలవాటు. వాళ్ళంతా ఆకాశం నుంచి ఊడిపడినట్లు మిగతావాళ్ళంతా వాళ్ళ దయాధర్మాలతో బతుకుతున్నట్లు ఫీల్ అయిపోతుంటారు.


భుజంగరావుకి ఒళ్ళు మండిపోయింది. తిట్టుకున్నాడు. 'వారే లం... కిందటి నెలలోనే కదరా రెండువేలు పట్టుకెళ్ళావ్. అవినీతిలో కూడా నీతి ఉండాలిరా. నీ బతుకు, నీ జాతకం అంతా నాకు తెల్సురా. నిన్ను నా హోటలు ముందే ముష్టి ఎత్తుకునేలా చేస్తాను- చూస్కోరా...' అంటూ కాగితం కలం తీసుకున్నాడు.

'అయ్యా మీ ఆఫీసువారిని ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలు వసూలు చేయటానికి పంపిస్తున్నారో, మమ్మల్ని నిలువుదోపిడీ చేయటానికి పంపిస్తున్నారో తెలీటంలేదు. నేను కొంత బకాయిపడిన మాట నిజమే. దాన్ని సాకుగా తీసుకొని ఫలానా వెంకటసుబ్బారావు గారు నా దగ్గర నుంచి ఇప్పటికి అంతకు మూడు రెట్లు గుంజారు. అయ్యా నాకు తెలీక అడుగుతాను, రూల్సు మాటేగానీ, తమరి ఆఫీసులో పనిచేసే వారికి ఏ [illegible] సుబ్బారావు గారి నెలసరి జీతం మూడువేలఅయిదు వందల డెబ్బయి ఆరు రూపాయల ఇరవై పైసలు. వారి సేవింగ్స్ పది హేను వందలు. చేతికొచ్చే జీతం రెండువేల డెబ్బయి ఆరు రూపాయలు. వారు నివసించే ఇంటికి వాడు ఇస్తున్న అద్దె రెండువేలు. రెండేళ్ళ కిందట ఆయన రెండు రూముల ఇంట్లో ఉండేవాడు. తినటానికి రెండో కంచం ఉండేదికాదు. ఆ ఒక్క కంచంలోకి అన్నం ఉంటే కూర ఉండేదికాదు. అట్లాంటి వెంకటసుబ్బారావు గారు ఈనెల నాలుగో తారీకు మధ్యాహ్నం తమరి ఆఫీసులో పనిచేసే



## నవ్వు నాలుగు రకాలైతే ఈ అంచావతారం నవ్వు ఏ కోవకి చెందుతుంది?

విలాసినిగారితో కల్సి కృష్ణ జ్యూయలరీకి వచ్చి యాభైవేల రూపాయలకు నగలు కొన్నారు. ఆ తరువాత వారిద్దరూ ఓబ్రాయ్ హోటల్లో సాయంత్రం దాకా ఉన్నారు. అక్కడవారు చెల్లించిన బిల్లు మూడువేలు. వెంకట సుబ్బారావుగారి అమ్మాయికి పెళ్లి కుదిరింది. మూడు లక్షల కట్నం ఇస్తున్నారు. విలాసినిగారి అమ్మాయికి పెళ్ళి చేస్తున్నారు. వెంకట సుబ్బారావుగారే విలాసినిగారి కూతురి పెళ్ళి ఖర్చు భరిస్తున్నారు. వచ్చేనెల పదమూడో తేదీన కచ్ భవన్‌లో జరిగే పెళ్లికి వచ్చి తమరే తిలకించండి. వా




ర్నా పేస్తా ఏ గంగలో దూకినా మాకేం ఫర్వాలేదు. కాని ఆ ఖర్చుల కోసం మమ్మల్ని పీడిస్తున్నారు. మేం కార్చే కన్నీళ్లను పన్నీరు బుడ్డిలోనింపి, రేపు పెళ్ళికొచ్చే మీ అందరి మీద చల్లుతారు... కనుక, ఆ పన్నీరు అంత సువాసన వెయ్యకపోతే మరోలా అనుకోకండి... మీకు వడ్డించే బిర్యానీని మా చెమటతో ఉడికిస్తారు. కనుక వాసన మరోలా ఉంటే ఏమనుకోకండి. బిర్యానీ కుర్మా ఎర్రగా ఉంటే బెదిరిపోకండి. అందులో మా రక్తం కల్సి ఉంటుంది. వెంకటసుబ్బారావు మీద మీరు యాక్ష

న్ తీసుకోకపోతే ఈసారి వారు మా హోటల్లోకి అడుగు పెట్టినప్పుడు, మా సర్వర్లు యాక్షన్ తీసుకుంటారు... చిత్తగించవలెను. భవదీయుడు, విధేయుడు. మమ్మల్ని మా బతుకు బతకనివ్వమనటం కోసం మీకు పాదాభివందనం చేసుకుంటున్న...

ఓ పిచ్చి పుల్లయ్య...'

అని భుజంగరావు ఆవేశంగా రాశాడు. పది కాపీలు టైపువేయించి, ఒకటి మంత్రిగారికి, ఒకటి సెక్రెటరీగారికి, ఒకటి చీఫ్ కమిషనర్ గారికి, ఒకటి కమిషనర్‌గారికి, ఒకటి డిప్యూటీ కమిషనర్‌గారికి, ఒకటి అసిస్టెంట్ కమిషనర్‌గారికి రిజిస్టర్ పోస్టులో పంపించాడు. పుల్లయ్య పేరుమీద వచ్చిన ఆ కాగితాలు చూడగానే డిపార్ట్‌మెంట్‌లో అంతా ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. 'వీడు ఎవడయ్యా మన ప్రాణానికి...' అంటూ విసుక్కున్నారు.

'వాడి సంగతి తరువాత చూద్దాం... ముందు వెంకటసుబ్బారావును సస్పెండ్ చేయండి...' అన్నారు.

వెంకటసుబ్బారావును సస్పెండ్ చేశారు. విజిలెన్స్‌వాళ్లు ఎంక్వయిరీ చేస్తున్నారు.

వెంకటసుబ్బారావు ఆరోజు ఉదయమే పానకాలరావుగారింటికి వెళ్లాడు. కుక్క భౌమంటూ మీదకు ఉరికింది. పానకాలరావుగారు బయటకు రాగానే, వెంకటసుబ్బారావు పరిగెత్తుకుపోయి ఆయన కాళ్ళమీద పడ్డాడు.

'సర్ బుద్ధి తక్కువై కక్కుర్తిపడ్డాను. నన్ను ఎలాగైనా కాపాడాలి. మీరే దిక్కు...' అన్నాడు.

'ఎలాగయ్యా.. వాడెవడో అసాధ్యుడులా ఉన్నాడు...' అన్నాడు పానకాలరావు.

వెంకటసుబ్బారావు చేతిసంచిలో నుంచి పదివేల రూపాయల కట్టతీసి ఆయన కాళ్ళదగ్గర పెట్టాడు.

'కొంచెం కష్టమయ్యా...' అన్నాడు పానకాలరావు.

వెంకటసుబ్బారావు ఇంకో పదివేల రూపాయల కట్టతీసి ఆయన పాదాలదగ్గర పెట్టాడు.

'నిన్ను ప్రొటెక్ట్ చేయాలంటే నేను రిస్క్ తీసుకోవాలయ్యా...' అన్నాడు పానకాలరావు.

వెంకటసుబ్బారావు ఇంకో పదివేల రూపాయల కట్ట ఆయన పాదాలదగ్గర పెట్టాడు.

'మినిస్టర్‌కి పిటిషన్ పెట్టాడయ్యా...'

ఇంకో పదివేలు ఆయన పాదాల దగ్గర వాలినాయి.

'సర్. ఇంకేం మాట్లాడకండి. మీరు కాదంటే, నా పెళ్లాం పిల్లలతోవచ్చి మీ ఇంటి ముందు గేటుకు అడ్డంగా పడుకుంటాం' అని గట్టిగా కాళ్ళు పట్టుకున్నాడు.

ఆరువారాల తరువాత వెంకటసుబ్బారావు మళ్ళీ వెంకటేశ్వరా విలాస్ ముందు స్కూటర్ దిగాడు. భుజంగరావు భయపడుతూ వెళ్ళి నమస్కారం పెట్టాడు.

వెంకటసుబ్బారావు అన్నాడు 'నీ మూలంగా నాకు యాభైవేలు ఖర్చు అయిందయ్యా... అది నువ్వే ఇవ్వాలి... మా డిపార్ట్‌మెంట్‌లో ఇవన్నీ మామూలేనయ్యా... అంచేత మాతో పెట్టుకోబోకు...' అంటూ వెంకట సుబ్బారావు వెరినవ్వు నవ్వాడు.

ఆ డిపార్ట్‌మెంట్ వాళ్ళు సాధారణంగా నవ్వరు. కానీ వెంకటసుబ్బారావు మాత్రం భుజంగరావును చూసి నవ్వుకుంటూ స్కూటర్ ఎక్కి వెళ్లిపోయాడు. 'పోరా, పిచ్చి పుల్లయ్య' అన్నట్లుగా ఉంది ఆ నవ్వు.